విరివిగా మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆనందపురం జోనల్ ఆఫీసు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ ఇప్పుడు అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. 'పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, కాలుష్యాన్ని అరికట్టడంతోపాటు భావితరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు అందరూ ముందుకు రావాలని పేర్కొన్నారు.

వారం రోజుల్లో పురోగతి కనిపించకపోతే సస్పెండ్ చేస్తా

సచివాలయ సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఘాటు హెచ్చరిక

విశాలాంధ్ర - పీఎం పాలెం: నిర్దేశించిన లక్ష్యాల మేరకు వారం రోజుల్లో పురోగతి కనిపించకపోతే సస్పెండ్ చేయక తప్పదని సచివాలయ ఉద్యోగులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సాగర్ నగర్-1, 2 వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సచివాలయం-1లో ప్రభుత్వ లక్ష్యాల మేరకు తగిన విధంగా పురోగతి లేకపోవడాన్ని గమనించిన ఆయన అసంతృప్తి చెందారు. సిటిజన్ సర్వే, ఈ-కేవైసీ చేయటంలో బాగా వెనుకబడి ఉన్నారని, ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని నిలదీశారు. ఇంకా 400 మంది తాలూక ఈ-కేవైసీ పెండింగ్ ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన వారం రోజుల సమయం ఇచ్చారు. ఈ వారం రోజుల్లో పురోగతి కనిపించకపోతే అత్యంత కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డుల నిర్వహణ, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అప్డేట్‌గా ఉండాలని, ఎప్పటి పని అప్పుడే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉషారాణి ఉన్నారు. అనంతరం అదే కాంపౌండ్‌లో ఉన్న యూపీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను గమనించారు. ప్రజలకు నాణ్యమైన రీతిలో మెరుగైన సేవలందించాలని ఈ సందర్భంగా సూచించారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీపీ శంఖబ్రత బాగ్చి

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్ : మహిళల ఫోటోలు మార్ఫింగ్ చేసి వేధింపులకు గురిచేసిన వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన విశాఖపట్నంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తన వాట్సాప్ స్టేటస్ ఫొటోలను డౌన్లోడ్ చేసి వాటిని మార్ఫింగ్ చేసి (నగ్నంగా ఉండేటట్లు చిత్రీకరించి) సోషల్ మీడియాలో పెట్టినట్టు ఓ మహిళ విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేసి కాకినాడకు చెందిన తాటికాయల దివాకర మారుతి సత్యతేజ్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు.

జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు సన్ స్కూల్ విద్యార్థి

విశాలాంధ్ర - భీమిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్, శృంగ వృక్షం, పాలకోడేరు మండలం పశ్చిమగోదావరి జిల్లాలో 14 సంవత్సరాలలోపు బాల బాలికలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో 8వ తరగతి విద్యార్థి కొయ్య సోహిల్ బంగారు పతకాన్ని సాధించి సన్ స్కూల్ నుండి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి త్వరలో మహారాష్ట్రలో జరగబోవు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక నియోజక వర్గంలో అనధికారంగా నడిపిస్తున్న బెల్ట్ షాపులను తొలగిం చాలని సమయపాలన పాటించకుండా కొనసాగుతున్న మద్యం బారుషాపుల లైసెన్సులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కె.వనజాక్షి, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.అచ్యుతరావు డిమాండ్ చేశారు. మంగళవారం గాజువాక ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ సిహెచ్.నాగ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు. బెల్ట్ షాపులో ఉదయం రాత్రి అని తేడా లేకుండా మద్యం దొరకడం వలన కుటుంబాల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ఇది కాకుండా వీధి ఒక మద్యం షాపుల లైసెన్సులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, బార్ మద్యం షాపులు సమయ పాలన లేకుండా తెరుస్తూ రాత్రి 12 గంటల వరకు నడిపిస్తున్నారన్నారు. ఉదయాన్నే బ్లాక్ మార్కెట్ తరహాలో షట్టర్ మోసి వేయించి ఉన్నా మద్యాన్ని అమ్ముతున్నారన్నారు. మద్యం షాపుల్లో మద్యాన్ని కల్తీ చేసే సంఘటనలు కూడా రాష్ట్రంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయన్నారు. మద్యం సమయపాలన లేకుండా దొరకడం వలన మహిళలకు రక్షణ కరువవుతుందని, మద్యం షాపులు దగ్గర మందుబాబులు రోడ్లపైకి వచ్చి అటువైపు వెళ్లే పాదచారులకు ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని, బెల్ట్ షాపుల్ని తొలగించాలని, మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే అమ్మేలా, సమయపాలన పాటించకుండా నిర్వహిస్తున్న బార్ మద్యం షాపుల లైసెన్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.పద్మ, జి.ఓంకార్ పాల్గొన్నారు.

గీతంలో ఐఐసి ప్రాంతీయ సమావేశం

విశాలాంధ్ర - మధురవాడ: కేంద్ర విద్యా మంత్రిత్వశాఖలోని ఇన్నోవేషన్ సెల్ మరియు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసిటిఇ) ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐ.ఐ.సి) ప్రాంతీయ సమావేశాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విశాఖ జిల్లా కలక్టర్ ఎమ్.ఎన్.హరేంధిరప్రసాద్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను వివరించారు. గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి గీతంలో వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ సిఇఓ డాక్టర్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి, సిఇఓ సుధాకర్ పొటుకూచి, ఆర్‌టిఐహెచ్ విశాఖపట్నం సిఇఓ డాక్టర్ రవిఈశ్వరపు, వాద్వాని ఫౌండేషన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్స్ డైరక్టర్ దయాకర్ ఎస్.మూర్తి, విద్యామంత్రిత్వ శాఖ ఏఐసిటిఇ ఛీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ బుద్ధ, విద్యామంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ ఏఐసిటిఇ ఇన్నోవేషన్ ఆఫీషర్ సెల్వరాణి సెల్వకుమార్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇన్నోవేటర్లు, అధ్యాపకులు, ఎకోసిస్టమ్ ఎనేబ్లర్లు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు మరియు స్టూడెంట్ అంబాసిడర్లు, ఐఐసి సంస్థలు ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐఎంయూలో సామాజిక చైతన్య కార్యక్రమాలు

విశాలాంధ్ర - మల్కాపురం: ఐఎంయూలో ముగిసిన సెమిస్టర్ సామాజిక చైతన్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం బి.టెక్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు - భారత రాజ్యాంగం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, కాలుష్య నివారణ, నీటి వనరుల నిర్వహణ, నీటి పొదుపు, ఎయిడ్స్ నివారణ, వికసిత్ భారత్ తదితర అంశాలపై సదస్సులు, చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించి 78 యూనిట్ల రక్తాన్ని ఇవ్వడం జరిగింది. అనేక సామాజిక అంశాలపై వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ. పి.ఎస్. భాగ్యలక్ష్మి సమన్వయపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను, అధ్యాపకులను క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య కేశవ దేవ్ ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుండి నృసింహ దీక్షలు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో జరుగు శ్రీ నృసింహ దీక్షలు దేవస్థానం ఆధ్వర్యంలో 3వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. నేటి నుండి 12.01.2026, మండల దీక్షలు, రెండవ విడత 11.12.2025, తేది.12.01.2026 వరకు 32 రోజుల దీక్షలుగా నిర్ణయించారు. శ్రీస్వామి వారి నృసింహ దీక్షలను స్వీకరించుటకు మరియు విరమణ చేయుటకు దేవాలయ సంప్రదాయం ప్రకారం తేదిలను నిర్ణయించుట జరిగిందని ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు.

జీవీఎంసీ అధికారులతో ఎమ్మెల్యే పంచకర్ల సమీక్ష

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం పరిధిలో గల జీవీఎంసీ జోన్ 6,8 అధికారులతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మంగళవారం సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. సుజాతనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షలో జోన్ 8 జోనల్ కమిషనర్ శంకర్రావు, జోన్ 6 జోనల్ కమిషనర్ శేషాద్రి, పట్టణ ప్రణాళిక అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, త్వరితగతిన పూర్తి చేయాలని నిర్దేశించారు. అలాగే వార్డు పరిధిలో ప్రజలకు అవసరమైన పనులు గుర్తించి అంచనాలు తయారు చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాలుగా సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే రమేష్ బాబు ఆదేశించారు.

పనుల నత్తనడకపై ఎమ్మెల్యే పల్లా అసంతృప్తి

విశాలాంధ్ర - గాజువాక: గాజువాక నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తన క్యాంప్ ఆఫీస్ లో జీవీఎంసీ అధికారులతో మంగళవారం సమీక్ష చేపట్టారు. శంకుస్థాపన చేసిన ప్రతీ పని త్వరగా పూర్తి అవ్వాలి అని చెప్పారు. కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో వున్న అన్ని ప్రధాన రహదారులు మరమ్మత్తులకు చేసిన శంకుస్థాపన పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రహదారుల విస్తరణలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే టీడీఆర్ లను మంజూరు చేయాలనీ ఆదేశించారు. కూర్మన్నపాలెం దువ్వాడ ప్రధాన రహదారి పనులు, బీసీ రోడ్డు నుండి పెదగంట్యాడ సర్వీస్ రోడ్డు వరకు, గంగవరం ప్రధాన రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలనీ స్పష్టం చేశారు. ఏడాది క్రితం వంటిల్లు వద్ద శంకుస్థాపన చేసిన పనులు ఇప్పటికి పూర్తికాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓల్డ్ గాజువాకని గోల్డ్ గాజువాకగా మార్చడమే తన లక్ష్యం అని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సమావేశంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, ఈఈ రాయల్ బాబు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరావు, డీఈ నారాయణ రావు, ఏఈ శివ, నియోజకవర్గం సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, 87వ వార్డు కార్పొరేటర్ బోండా జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ - వన్‌టౌన్: ఫిషింగ్ హార్బర్‌లో ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ హరేంద్ర ప్రసాద్, ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు, హార్బర్ శుభ్రత సౌకర్యాల పురోగతిని సమీక్షించారు. విశాఖ పోర్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్ర మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్ కుమార్ పనుల పురోగతిని నివేదించారు. పనులు త్వరగా, నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హార్బర్‌లో సరైన ట్రాఫిక్ నిర్వహణ, పరిశుభ్రత, నీటి సరఫరా ఉండేలా పోర్టు అధికారులతో సమన్వయం చేసుకోవాలని మత్స్య శాఖ జేడీ పి.లక్ష్మణ్‌రావును ఆదేశించారు. ఎంపీఈడీఏ డీడీ మొహంతి, ఈఐసీఏడీ సుధాంశు, మత్స్య అభివృద్ధి అధికారి ఎంఆర్ ఆశాజ్యోతి, రెవెన్యూ, పోలీస్, పోర్టు ట్రాఫిక్ విభాగం, జీవీఎంసీ ఈ కార్యక్రమంలో అధికారులు, బోట్ ఆపరేటర్ల ప్రతినిధులు ఎం.లక్ష్మణ్ రావు, సిహెచ్ వీరన్న, బి.కొండ బాబు, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ వేదికగా ఫిబ్రవరిలో ఐఎఫ్ఆర్ కార్యక్రమం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో విశాఖ వేదికగా ఘనంగా 2026 ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐ ఎఫ్ ఆర్) కార్యక్రమం జరుగనున్నందున అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ దేశాల అతిథులు, ప్రతినిధులు విశాఖలో విహరించను న్నారని, విశాఖ మ్యూజియం ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ కు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో విశాఖ మ్యూజియం అంతటా కలియతిరిగి పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో విశాఖ నగరంలో జరుగునున్న అంతర్జాతీయ వేదికగా ఐ ఎఫ్ ఆర్ కార్యక్రమం జరుగనున్నదని , ఈ విషయమై ఎపెక్స్ కమిటీ కోఆర్డినేషన్ మీటింగ్ లో నేవల్ అధికారులు పలు విషయాలను, అతిథులు సందర్శించవలసిన ప్రాంతాలను ప్రస్తావించారన్నారు. ఈ కార్యక్రమానికి దేశ ,విదేశాల నుండి అధిక సంఖ్యలో నేవల్ అధికారులు, ప్రతినిధులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ముఖ్య అతిథులు విశాఖ నగరంలో పలు ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. అందుకు జీవీఎంసీ నిర్వహిస్తున్న విశాఖ మ్యూజి యంను అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, మ్యూజియంలో ఉన్న ప్రదర్శనలను అన్ని వివరాలతో క్రమ పద్ధతిలో ప్రదర్శనకు ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియంలో ప్రదర్శించిన అన్ని వస్తువుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో పరిశుభ్రత పనులు చేపట్టాలని,అవసరమగు మరమ్మత్తులు, ల్యాండ్ స్కాపింగ్, గార్డెన్ అభివృద్ధి పనులు, పెయింటింగులు, లైటింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, అలాగే డ్రింకింగ్ వాటర్ తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి విశాఖ మ్యూజియంలో గల మేరీ టైం, హెరిటేజ్ మ్యూజియం లను అతిథులు, ప్రతినిధులను ఆకర్షించేలా అందంగా తీర్చిదిద్దాలని , త్వరితగతిన అవసరమగు పనులను పూర్తి చేయాలని ప్రధాన ఇంజనీరు పి వి వి సత్యనారాయణ రాజుకు కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీరు గంగాధర్, సహాయక ఇంజనీరు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ మిల్లు కార్మికులకు బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలస జ్యూట్ మిల్‌లో ఐఎన్‌టియుసి అధ్యక్షుడు కాకర్లపూడి వరాహలరాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వరహాలరాజు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన స్టేట్ లేబర్ సెక్రటరీ గంధం చంద్రుడు విశాఖపట్నం వచ్చి జ్యూట్ మిల్ యూనియన్ నాయకులతో యాజమాన్యంతో మాట్లాడతారు. కాబట్టి కార్మికులకు రావలసిన బకాయిలు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే జ్యూట్ మిల్ ఆస్తుల తాలూకా భూములు అటాచ్ మెంట్ బకాయిలు చెల్లించాక తీసి వేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చిల్ల వెంకట రమణ, జీరు వెంకటరెడ్డి, కొయ్య సురుగురువులు, సరగడ శ్రీరామ్ మూర్తి, సరగడ సూరిబాబు, వాకాడ గోవింద్, కొయ్య అప్పల చిట్టి, పోలిపల్లి ప్రకాష్,పళ్ళ అప్పారావు, గండిబోయిన రాము నాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు

విశాలాంధ్ర - పద్మనాభం: పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని పద్మనాభం మండలం మండల విద్యాశాఖ అధికారి బాబూలాల్ తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు మండలంలోని పాండ్రంగి జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టుకు తాత్కాలిక పద్ధతిన అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించడం జరిగినదని తెలియజేశారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్, అర్హత బిఎ లేదా బీకాం, బిఈడి సోషల్ మెథడాలజీ కలిగిన వారు అర్హులన్నారు. డిసెంబరు ఐదో తారీకు లోపు తమ దరఖాస్తులను పద్మనాభం మండలం ఎంఈఓ ఆఫీసుకు సమర్పించాలని తెలియజేశారు. ఈ పోస్టు యొక్క కాలవ్యవధి 5 నెలలు అని, జీతం నెలకు 12500 రూపాయలన్నారు. వివరాలకు 9701648611ను సంప్రదించాలన్నారు.

5వ వార్డులో అభివృద్ధి పనులకు భూమిపూజ

విశాలాంధ్ర - కొమ్మాది: జీవీఎంసీ పరిధిలోని 5వ వార్డులో సుమారు 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ నిర్వహించారు. వార్డులోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఈ పనులను చేపట్టినట్లు ఆమె తెలిపారు. పరదేశి పాలెంలో సామాజిక భవనం, రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టనున్నారన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగానే రూ.40 లక్షల వ్యయంతో కూడిన నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఈగల రవికుమార్, ఏఈ తిరుమలరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, స్థానిక నాయకులు ముచ్చి రామనాయుడు, దేవర శివ, కొండపు రాజు, మాన్యాల సురేష్, బోర తాతారావు, బోర అప్పల సూరిబాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకటరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వనము రాజు, బోర సురేష్, సత్యాల కృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర - గాజువాక: క్రీడలతో మానసిక ఉల్లాసానికి క్రీడలే అన్న రీతిలో నేడు విద్యాసంస్థలు చదువులతోపాటు క్రీడలకూ ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ క్రీడా పోటీల్లో సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మనుమరాళ్ళు, మనుమడు బహుమతులు సాధించారు. విశాఖ గాజువాక 'ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్'లో గత రెండు రోజుల పాటు జరిగిన క్రీడా దినోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో వేదుల రాఘవ, లలితా జ్యోతి దంపతుల కుమార్తె కృత్తిక (7 వ తరగతి) ఖో ఖోలో ద్వితీయ స్థానం సిల్వర్ మెడల్, సర్టిఫికెట్, అలాగే కుమారుడు కార్తికేయ (3 వ తరగతి) రన్నింగ్ రేస్‌లో ద్వితీయ స్థానంతో సర్టిఫికేట్, సిల్వర్ మెడల్ పొందారు. హైదరాబాద్ నిజాంపేట్ లోని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్‌లో జరిగిన క్రీడోత్సవాల్లో నిమ్మరాజు శ్రీవత్సవ కుమార్ - నాగజ్యోతి దంపతుల కుమార్తె జోష్విక ప్లేస్కూల్ విభాగం రన్నింగ్ రేస్ నాలుగో స్థానంలో సర్టిఫికెట్ పొందింది.



విద్యార్థులకు పోషకాహారం పంపిణీ

విశాలాంధ్ర - వన్‌టౌన్: 39వ వార్డులో క్వీన్స్ మేరీ హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతులమీదుగా పోషకాహార పదార్థాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయాన్నే పిల్లలు ఆకలి తీర్చడం, తరగతి గదులు ప్రారంభమయ్యే ముందు పోషకాహారం అందించడం వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాధిక్, కూటమి శ్రేణులు కొల్లి సింహాచలం, ప్రణీత్, తాతరావు, శ్రీను, కోటమ్మ, కొండబాబు, రమణ, బంగారి, నాయుడు, ఎమ్మార్వో పైడప్ప నాయుడు, ప్రధానోపా ధ్యాయులు జోగేంద్ర, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రశాంతి, అక్షయపాత్ర ఫౌండేషన్ పెద్దలు మాధవ దాసు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు చిందరవందరగా రంధ్రాలు

చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - పెందుర్తి : ప్రభుత్వ ఆస్తులేగా ప్రయోగాలు చేద్దాం అనుకున్నారో.. లేక భవిష్యత్తులో కాంట్రాక్ట్ వస్తే తనకే దక్కాలనే దురాలోచనో తెలియదు గాని కొందరు వ్యక్తులు టిడ్కో ఇళ్లకు చిందరవందరగా పెద్ద ఎత్తున రంధ్రాలు చేస్తున్న ఘటన జీవీఎంసీ 92 వ వార్డు పద్మనాభ నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. పద్మనాభ నగర్‌లో ప్రభుత్వం టిడ్కో ఇల్ల నిర్మాణం చేపట్టింది. వాటిలో కొన్ని పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిని ఇంకా ఎవరికీ కేటాయించలేదు. ఈ దశలో కొందరు వ్యక్తులు ఆ ఇళ్లకు కేబుల్ కనెక్షన్ పేరుతో చిందరవందరగా రంధ్రాలు చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ డ్రిల్లింగ్ చేస్తూ ప్లాస్టరింగ్ ను పాడు చేస్తున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా లబ్ధిదారుల అవసరాలను గుర్తించకుండా ఇళ్లకు కన్నాలు కొట్టి రూపురేఖలను పూర్తిగా పాడు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇల్లు నిర్మాణం చేపట్టగా వాటి రూపు రేఖలు పాడు చేస్తున్న ఉదంతం పై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయగా కేబుల్ కనెక్షన్ ఏర్పాటుకు ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తమకు తెలియకుండానే ఆ వ్యక్తులు టిడ్కో ఇళ్లకు రంధ్రాలు చేస్తున్నారని అధికారులు చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అక్రమంగా జరుగుతున్న కేబుల్ కనెక్షన్ పనులను ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించగా అధికారులు నీళ్లు నములుతుం డటం విశేషం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టిడ్కో ఇళ్ళను రక్షించాలని, అనధికారికంగా ఇళ్లకు రంధ్రాలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా ఈ విషయంపై దర్యాప్తు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేసారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, హైవేలో జీబ్రా క్రాసింగ్ వద్ద సోలార్ బ్యాంకర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలసి రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం విశాఖ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల వివరాలను, వారికి ప్రభుత్వం తరపున అందజేసిన వివరాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గుర్తు తెలియని వాహనాల ద్వారా ప్రమాదానికి గురైన బాధితులకు అందుతున్న పరిహారం గురించి సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యల గూర్చి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మేజర్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, పాఠశాల, కళాశాలల పరిసర ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయవలసిందిగా జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. రోడ్ల పై జీబ్రా మార్కింగ్, రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్ ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అవసరమైన చోట బస్ షెల్టర్ల ఏర్పాటుతో పాటు భారీ వాహనాలు నిలిపేందుకు ట్రక్-బేలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్ పాత్ లు ఆక్రమణలకు గురి కాకుండా ప్రజలు వినియోగించుకునేలా పోలీస్, జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కూడళ్లతో పాటు అవసరమైన చోట సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి ఆర్.సి.హెచ్. శ్రీనివాస్ గత సమావేశంలో చర్చించిన అంశాలను చేపట్టిన పురోగతిని సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో పోలీసు, వైద్యారోగ్య శాఖ అధికారులు, జీవీఎంసీ అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో దర్శన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - వన్ టౌన్: రెండో గురువారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేయనున్న నేపథ్యంలో మరిన్ని సౌకర్యాల కల్పనకు క్యూలు,ప్రసాదాల కౌంటర్, సామాన్య భక్తుల సదుపాయాలు ఇతర అంశాలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరా తీశారు. భక్తుల అధిక రద్దీ నేపథ్యంలో స్థానిక సిబ్బంది సమన్వయంతో మరిన్ని ఏర్పాట్లు కల్పించే విధంగా చర్యలకు పలు సూచనలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి అమ్మవారి మార్గశిర మహోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ఏ.ఈ.ఓ ఆనంద్ కుమార్, రాజేంద్ర, ఈ ఈ రమణ, సిబ ప్రసాద్ పాల్గొన్నారు.

డిసిసి చీఫ్‌గా నియమించండి.

ఏఐసిసికి దరఖాస్తు చేసుకున్న వైయస్ జగన్నాథం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని నియమించేందుకు, ఆదేవిధంగా నియోజకవర్గాల ఇన్చార్జిలను నియమించేందుకు ఏఐసిసి, పిసిసి ప్రతినిధులు విశాఖలో పర్యటిస్తున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గాల వారీగా సంక్షేమ నిర్వహిస్తూ బాధ్యులను ఎన్నుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఏఐసిసి నాయకులు సునీల్ కొండాజీ అహిరే, ఏపీ పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మార్టిన్ లూథర్, అమర్

జహబీర్ డిసిసి అధ్యక్షుడి స్థానానికి పార్టీ పిసిసి సభ్యుడు వై ఎస్. జగన్నాధ రావు (జగన్) దరఖాస్తు చేసుకున్నారు. పీసీ నాయకుడిగా, పార్టీలో సీనియర్ అయిన తనను జిల్లా అధ్యక్షునిగా నియమించాలని కోరారు.ఏపీ పిసిసి సీనియర్ నాయకులు జమ్ము ఆదినారాయణ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గంలో బి హెచ్ పి వి యూనియన్ ఆఫీస్‌లో సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో ఢిల్లీ నుండి రాహుల్ గాంధీ టీమ్ నుంచి ఏఐసిసి అబ్జర్వ్ సునీల్ కొండా అహిరే, పీసీసీ అబ్జర్వ్ హమారాజా ఫేగ్, (శ్రీ. మార్టిన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నియోజకవర్గాల వారి పార్టీ ప్రెసిడెంట్ ఎన్నుకొనుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లాలో ఉన్న విశాఖపట్నం మరియు భీమిలి గాజువాక నియోజకవర్గం లో కలిపి ఆరు నియోజకవర్గాల్లో పార్టీ

ప్రెసిడెంట్లకై దరఖాస్తులు స్వీకరించిన అభ్యర్థులపై పార్టీ శ్రేణుల నుండి కార్యకర్తల నుండి ప్రజల నుండి అభిప్రాయ సేకరణ చేసి వివరాలను అధిష్టానానికి తెలియజేస్తారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎవరినైతే పార్టీ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారో వారిని రాహుల్ గాంధీ నియోజకవర్గాల వారీగా పార్టీ ప్రెసిడెంట్ గా నియమిస్తారు. ఈ కార్యక్రమం లో జమ్ము ఆదినారాయణ, జిల్లా కౌన్సిలర్ హరిని వర్మ, విశాఖ జిల్లా అధ్యక్షులుగా పోటీ చెస్తున్న జెర్రిపోతుల ముత్యాలు, గాజువాక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నవరం రైతుల సమస్యకు పరిష్కారం

ఇంటికో ఉద్యోగం, 6 సెంట్ల నివేశన స్థలం: గంటా

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలంలోని అన్నవరం భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతంలో మై ఫెయిర్, ఒబెరాయ్ వంటి ప్రముఖ హోటల్స్.. రిసార్ట్స్.. కు ప్రభుత్వం భూములు కేటాయించిన విషయం విదితమే. 28 మంది రైతులు ఒక్కొక్కరు 50

సెంట్లు చొప్పున దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో సాగు చేసుకుంటున్నారు. ఆతిథ్య రంగానికి ప్రభుత్వం భూమలిచ్చిన సమయంలో రైతులు ఆందోళన చేశారు. అయితే భూ సాగుకు సంబంధించి ఎలాంటి అధికారిక రికార్డులు లేకపోవడంతో రైతులకు పరిహారం చెల్లింపు సాధ్యపడదని అధికారులు అప్పట్లో తేల్చి చెప్పారు. దీంతో తమకు న్యాయం చేయాలని రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రైతులు ఎమ్మెల్యే గంటా ను మంగళవారం ఎం.వి.వి. కాలనీ లోని ఆయన నివాసంలో కలిశారు. రైతులు... భీమిలి ఎమ్మార్వో పి.రామారావు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, చిక్కాల విజయ్ బాబు లతో చర్చించిన తర్వాత ఒక్కో రైతుకు స్థానికంగా 6 సెంట్ల స్థలాన్ని, కుటుంబానికి ఒకరికి ఉద్యోగ అవకాశం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. కోర్టులో దాఖలు చేసిన కేసు విత్ డ్రా సహకరించడానికి రైతులు సుముఖత వ్యక్తం చేశారు.

వినూత్న బోధన ద్వారా విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - పీఎం పాలెం: వినూత్న బోధనా పద్ధతులను అవలంబించటం ద్వారా ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఎండాడలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులను గమనించారు. అక్కడి విద్యార్థులతో మమేకమయ్యారు. పలు అంశాలపై ముచ్చటిస్తూ కుశల ప్రశ్నలు వేశారు. వివిధ పాఠ్యాంశాల్లోని అంశాలపై ప్రశ్నలు అడిగారు. పుస్తకాలను, అందులోని చిత్రాలను చూపించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. వినూత్న రీతిలో ఆసక్తికరించే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని, తార్కిక భావజాలం విద్యార్థుల్లో పెంపొందేలా బోధన సాగించాలని సూచించారు. పిల్లలు అడిగే అన్ని ప్రశ్నలకు స్నేహపూర్వక వాతావరణంలో సమాధానం ఇవ్వాలని, అప్పుడే వారిలో విడియం పొందుతుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలోని ఇతర వసతులను, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. వివిధ రికార్డులను తనిఖీ చేశారు. అక్కడున్న సమస్యలను, ఇతర అంశాలను ఉపాధ్యాయులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

విశాఖలో డొమెస్టిక్ విమానాశ్రయం కొనసాగించాలి

అనకాపల్లిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించాలి
పౌర విమానయాన మంత్రికి ఆచార్య కెవిఎస్ చలం లేఖ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పౌర విమానయాన రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో మీరు చేస్తున్న అద్భుతమైన పనికి అభినందనలు తెలియజేస్తున్నాను అయితే, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం లాంటి నగరాల నుండి విమానాల సంఖ్యను తగ్గించడం, నగరాన్ని నిర్లక్ష్యం చేయడం వలన అభివృద్ధి కుంటుపడుతుందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కి ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక గౌరవ అధ్యక్షులు ఆచార్య చేస్తున్న లేఖ రాశారు. విమానాశ్రయాన్ని భోగాపురం, విజయనగరం జిల్లాకు మార్చాలనే ప్రతిపాదనను మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నామని, విమానాశ్రయం నావికాదళ నియంత్రణలో ఉందని , అనేక సంవత్సరాలుగా పౌర విమానయాన శాఖ ద్వారా ఉపయోగించబడుతుందని, ఎయిర్ కనెక్టివిటీ మద్దతుతోనే నగరం అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక రాజధానిగా విశాఖను సిఎం చంద్రబాబు నాయుడు ఊహించారని, మీలాంటి ముఖ్యమైన ప్రజా ప్రతినిధుల , ఈ ప్రాంతం అభివృద్ధిని కాంక్షించే వారు అది నిజం కావాలని అన్నారు. కోరుకుంటున్నాము. విశాఖపట్నం వంటి పెరుగుతున్న అంతర్జాతీయ , ప్రాంతీయ కేంద్రానికి విమానాశ్రయం లేకపోతే అది ఒక పెద్ద అవరోధంగా మారుతుంది. ఇది జిల్లా పౌరులకు , వ్యాపార మరియు కార్పొరేట్ ఉద్యోగులకు దేశీయ గమ్యస్థానంగా పనిచేయాలని, పాత జిల్లా అయిన అనకాపల్లికి కొత్త గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తారని మేము ఆశిస్తున్నట్లు తెలిపారు.

44వ వార్డులో పలు ప్రాంతాలలో తాగునీటి సరఫరా సమయం మార్పు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ 5వ జోన్ 44 వ వార్డు లోని పలు ప్రాంతాలలో తాగునీటి సరఫరా సమయం తాత్కాలికంగా మార్పు చేయడం జరిగిందని జీవీఎంసీ నీటి సరఫరా నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు-1 సుధాకర్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

బాలయ్య శాస్త్రి లేఅవుట్ గ్రీన్ పార్క్ కాలనీలో గల 1800 కె.ఎల్. జి. ఎల్. ఎస్. ఆర్ రిజర్వాయర్ స్లాబ్ అత్యవసర మరమ్మత్తు నిమిత్తం 44వ వార్డులోని మస్జిద్ తాటిచెట్లపాలెం ఏరియా, ఆంధ్రజ్యోతి కార్యాలయం పరిసర ప్రాంతాలలో ఉన్న త్రాగు నీటి సరఫరా సమయం ఉదయం 6 గంటల నుండి 6:45 నిమిషాల వరకు ఉన్న సమయాన్ని కొత్తగా సాయంత్రం 4 గంటల నుండి 4:45 నిమిషాల వరకు, రామచంద్ర నగర్ ఏరియా సాయిబాబా గుడి పరిసర ప్రాంతాలు ఉదయం 6:45 నుండి 7: 30 వరకు ఉన్న సమయాన్ని సాయంత్రం 4:45 నుండి 5:30 వరకు, మస్జిద తాటిచెట్లపాలెం ఏరియా ఉర్దూ స్కూల్, పెద్దూరు మసీదు పరిసర ప్రాంతాలలో ఉదయం 7:30 నుండి 8:15 నిమిషాల వరకు ఉన్న సమయాన్ని సాయంత్రం 5:30 నుండి 6:15 నిమిషాల వరకు, అబిద్ నగర్ ఏరియా రంగరాజు కాలనీ, పల్లవి అపార్ట్మెంట్ వెనక రోడ్డు పరిసర ప్రాంతాలలో ఉదయం 8:15 నిమిషాల నుండి 9 గంటల వరకు ఉన్న సమయాన్ని సాయంత్రం 6:15 నుండి 7 గంటల వరకు తాగునీటి సరఫరా సమయం వేళలను మార్పు చేయడం జరిగిందని, కావున ఈ మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు పైన తెలిపిన సమయంలో నీటి సరఫరా జరుగుతుందని పనులు పూర్తయిన వెంటనే పాత సమయాలలో తిరిగి యథాతథంగా అమల్లోకి తీసుకు వస్తామని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ తెలియజేశారు.

పర్యాటక మంత్రిత్వ శాఖ, మాస్టర్ కార్డ్ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర - విశాఖపట్నం: దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రీమియం గమ్యస్థానంగా భారతదేశం పట్ల ఆకర్షణను వృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ, మాస్టర్ కార్డ్ రెండిట్ల అవగాహన ఒప్పందం పై సంతకం చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారతదేశంలోని గొప్ప సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సహజ, పాక సంపదలను హైలైట్ చేసేందుకు మాస్టర్ కార్డ్ ప్రఖ్యాత ప్రైస్‌లెస్ ప్రోగ్రామ్‌తో సహా గ్లోబల్ ప్లాట్‌ఫారమ్‌లను ప్రభావితం చేస్తుంది. విభిన్న అవసరాలున్న ప్రయాణికుల కోసం సంయుక్తంగా మార్కెటింగ్ క్యాంపెయిన్‌ను అమలు చేస్తూ, సురక్షితమైన, బాధ్యతాయుతమైన డిజిటల్ చెల్లింపు పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ మరియు ప్రైవేట్ వాటాదారులను కలుపుకుని వెళ్లడం ద్వారా ఇది పర్యాటక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. గోవాతో ప్రారంభించి ప్రైస్ లెస్ డాట్ కామ్ వారణాసిలో అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్భాగాలలో అరుదైన అనుభవాలను అందుబాటులోకి తీసుకువస్తుంది, భవిష్యత్తులో ఈ జాబితాలో మరిన్ని ప్రాంతాలు చేరనున్నాయని మాస్టర్ కార్డ్ చీఫ్ మార్కెటింగ్ %c% కమ్యూనికేషన్స్ అధికారి రాజా రాజమన్నార్ పేర్కొన్నారు. మాస్టర్‌కార్డ్ భారతదేశం దక్షిణాసియా అధ్యక్షుడు గౌతమ్ అగర్వాల్ మాట్లాడుతూ, "చెల్లింపులను సురక్షితంగా, మారుమూల ప్రాంతాలతో సహా దేశవ్యాప్తంగా ప్రజలు, బిజినెస్‌లకు మరింత అందుబాటులో ఉంచడం ద్వారా భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు మాస్టర్‌కార్డ్ కట్టుబడి ఉందన్నారు.

ఆదర్శ్‌లో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.ఆ తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి. థియోఫిలస్ మాట్లాడుతూ జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 2న భోపాల్ గ్యాస్ విపత్తు బాధితుల జ్ఞాపకార్థం జరుపుకుంటారని, పెరుగుతున్న కాలుష్య స్థాయిల గురించి, వాతావరణం, ఆరోగ్య, ప్రమాదాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజకుమార్ మాట్లాడుతూ కాలుష్యం యొక్క ప్రమాదాలను, వాటిని నివారించడానికి అవసరమైన చర్యలను, విద్యార్థులకు వివరించారు.

ఈ అవగాహన సదస్సులో ఏవో రవిబాబు, కంప్యూటర్ లెక్చరర్ రాజేష్ మరియు వినీత, సూపరింటెండెంట్ ప్రకాష్, లైబ్రేరియన్ నాగరాజు పాల్గొన్నారు.

రైతులు దిగాలు చెందొద్దు

ప్రత్యేక కొనుగోలు కేంద్రాల ద్వారా 10 వేల టన్నులు సేకరించేందుకు చర్యలు
జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి వెల్లడి

విశాలాంధ్ర - కొమ్మాది: ఇప్పటికే రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టిందని జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి అన్నారు. వారికి దగ్గరలో కొనుగోలు కేంద్రాలు పెట్టి సిబ్బందిని అక్కడే అందుబాటులో ఉంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తోందని, పండిన పంటను వెనువెంటనే అమ్ముకునేలా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేయటంతో పాటు గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తూ అన్నదాత మన్ననలు పొందుతోందన్నారు. ప్రభుత్వం తీసుకున్న సానుకూల నిర్ణయాల వల్ల స్థానిక రైతు సేవా కేంద్రం పరిధిలోనే సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని, తేమ శాతం చూడటంతో పాటు, ధాన్యం అమ్ముకునేందుకు వీలుగా షెడ్యూల్ కూడా ఇస్తున్నారని, జీపీఎస్ అనుసంధానమైన వాహన ఏర్పాటు చేయటంతో, ఎఫ్.టి.ఓ.లు జనరేట్ చేయటంలో కాలయాపన చేయకుండా క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం అందిస్తున్నారని అన్నారు. జిల్లాలోని గ్రామీణ మండలాల పరిధిలో పది వేల టన్నుల ధాన్యం సేకరించేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది. దీనికి గాను అధికారులు పద్మనాభం మండల పరిధిలో 5, భీమిలి మండలంలో 2, ఆనందపురం మండలంలో 1, పెందుర్తి మండల పరిధిలో 2 కేంద్రాలు.. మొత్తం 10 ఏర్పాటు చేసినట్లు తెలిపారు గతేడాది ఐదు వేల టన్నుల లక్ష్యం కాగా, 5,600 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ఏడాది పదివేల టన్నులు సేకరించేందుకు చర్యలు తీసుకున్నారని, జిల్లాలోని బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించిన ఆరు మిల్లులను గుర్తించి లావాదేవీలు కొనసాగిస్తున్నారని, గతేడాది సాంబ మసూరి ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. ఈ ఏడాది స్వర్ణ, 1121 వంటి సన్నరకంతో పాటు సాంబా మసూరి కూడా తీసుకోవటం గమనార్హం అన్నారు. ప్రభుత్వం సాధారణ రకం ధాన్యానికి రూ.2,369, సన్న రకాలకు రూ.2,389 చెల్లిస్తున్నట్లు చెప్తోంది. గతేడాదితో పోల్చితే ఈ సారి రూ.69 క్వింటాకు అదనంగా చెల్లిస్తోంది. జిల్లాలో సుమారు 11,700 ఎకరాల్లో ధాన్యం పండిస్తుండగా.. 27వేల టన్నుల దిగుబడి వస్తోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి విశాలాంధ్రకు తెలిపారు. రైతుల సౌకర్యార్థం వారికి దగ్గరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. అందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలి. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే విక్రయించుకోవాలన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు కేథరిన్ విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక భీమిలిలో గల కేథరిన్ స్కూల్ విద్యార్థులు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ కరాటే పోటీల్లో 3 పతకాలు సాధించి విజయకేతనం ఎగరవేశారు. ఈ పోటీలలో బాలికల విభాగంలో గ్రేస్ ద్వారక (6వ తరగతి) ఫైనల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడమే కాకుండా త్వరలో జరుగబోయే జాతీయ కరాటే పోటీలకు ఎంపికై విశాఖ జిల్లాకే మణిహారంగా నిలిచింది. అంతేకాకుండా -22 కాటగిరిలో పూజిత (6వ తరగతి), -24 కాటగిరిలో కుశిత (6వ తరగతి), -50 కాటగిరిలో ఎ.లిఖిత శ్రీ (9వ తరగతి) అద్భుతమైన తమ కరాటే ప్రతిభను చూపి ఒక్కొక్కరు ఒక్కొక్క కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నారు.



ఈ సందర్భంగా కేథరిన్ విద్యాసంస్థల అధినేత అలివర్ రాయి మాట్లాడుతూ ఈ విధంగా జాతీయ స్థాయి పోటీలకు వివిధ క్రీడలలో కేథరిన్ స్కూల్ నుండి ఈ ఏడాది ఇప్పటికే నలుగురు ఎంపికకావడం ఆనందదాయకం అని అన్నారు.

టీకాతో మెనింజైటిస్ వ్యాధి కి అడ్డుకట్ట

- పీడియాట్రీషియన్ డాక్టర్ ప్రియాంక

విశాలాంధ్ర - విశాఖపట్నం: మెనింజైటిస్, సాధారణంగా బ్రెయిన్ ఫీవర్ అని కూడా పిలువబడే ఈ వ్యాధి, టీకాతో నివారించగల తీవ్రమైన సంక్రమణ అని నెక్స్ట్ చిల్డ్రన్ క్లినిక్ పీడియాట్రిషియన్ డాక్టర్ డివి ప్రియాంక తెలిపారు. ఇది ముఖ్యంగా పిల్లల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. మెనింజైటిస్ అవేర్‌నెస్ ఇనిషియేటివ్ ఈ వ్యాధి గురించి అవగాహన పెంచడం, తొందరగా గుర్తించడం మరియు టీకాల ద్వారా నివారణ యొక్క ప్రాధాన్యతను సాంధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్లోబల్ స్థాయిలో ఈ వ్యాధిని పూర్తిగా ఎదుర్కొనే ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 25 లక్షల కేసులు నమోదవుతున్నాయి. వీరిలో మరణించే వారికి దగ్గరగా 70% మంది ఐదేళ్ల లోపు పిల్లలు ఉంటారు. పాలిసులు (సీజర్స్), కోమా, అలాగే వినికిడి/దృష్టి లోపం, జ్ఞానతక్త సమస్యలు, అవయవాలు/కాలుల్లో బలహీనత వంటి నర సంబంధ సమస్యలు ఉంటాయని టీకా వేయించుకోవాలని, జాగ్రత్త పడాలని నెక్స్ట్ చిల్డ్రన్ క్లినిక్ పీడియాట్రిషియన్ డా. డి. వి. ప్రియాంక తెలిపారు.

ఐఐఎం విశాఖపట్నంతో ఐఎస్ఎఫ్‌బి భాగస్వామ్యం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎం విశాఖపట్నం), ఇమ్మర్సివ్ లెర్నింగ్ స్థాపించిన ఇమ్మర్సివ్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ బిజినెస్ (ఐఎస్ఎఫ్‌బి)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో నిర్వహించనున్న నిర్మాణాత్మక విద్యా ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లో పాల్గొనే అవకాశం కలుగుతుంది. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఐదు రోజుల అకడమిక్ ఇమర్షన్‌కు హాజరవుతారు. ఈ సమయంలో ఐఐఎం విశాఖపట్నం ఫ్యాకల్టీ నేరుగా బోధించే ప్రధాన కాన్సెప్ట్‌లను అభ్యసిస్తారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు మూడు రోజుల ఆన్-క్యాంపస్ ఇమర్షన్‌కు హాజరవుతారు. అదనంగా ఐఐఎం విశాఖపట్నం ఫ్యాకల్టీ అందించే 126 గంటల అకడమిక్ డెలివరీలో పాల్గొంటారని ఐఎస్ఎఫ్‌బి సీఈఓ జాయ్ పరేఖ్ ఐఐఎం విశాఖపట్నం డీన్ (అకడమిక్స్) ప్రొఫెసర్ విజయ భాస్కర్ మరి శెట్టి తెలిపారు.

ఆరోగ్య రంగంలో 'అపోలో ఫార్మసీ' సరికొత్త అధ్యాయం

విశాలాంధ్ర - విశాఖపట్నం: నాణ్యమైన మందులకు నమ్మకమైన చిరునామా అది.. నాలుగు దశాబ్దాల ఆరోగ్య సేవలో నిబద్ధతకు నిదర్శనం అది.. అదే 'అపోలో ఫార్మసీ'. దేశ నలుమూలలా విస్తరిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన అపోలో సరికొత్త మైలురాయిని చేరుకుంది. అపోలో ఫార్మసీ నెట్‌వర్క్ ఇప్పుడు ఏడువేల దుకాణాలతో కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఉత్తరప్రదేశ్‌లోని

అయోధ్యలో 7,000వ దుకాణాన్ని ప్రారంభించడంతో ఇది సాకారం అయింది. ఈ సందర్భంగా అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శోభనా కామినేని మాట్లాడుతూ భారతీయులలో ప్రతి ఐదుగురిలో నలుగురికి కేవలం పది నిమిషాల దూరంలోనే ఉంటున్నామని తెలిపారు. రోజుకు పది లక్షలకు పైగా ఆర్డర్లు ఇస్తున్నామన్నారు. ఈ 7,000వ దుకాణం మైలురాయి ప్రజలు మా మీద ఉంచిన నమ్మకానికి ప్రతీక అన్నారు. యాక్సెస్‌ను మరింతగా పెంచడం, ఫార్మసీ నెట్వర్క్‌ను బలోపేతం చేయడంపై దృష్టి పెడతామన్నారు. అపోలోను మొదటి, అత్యంత నమ్మకమైన ఆరోగ్య భాగస్వామిగా నిలబెట్టడం మా లక్ష్యమన్నారు. ఈ అపోలో ఫార్మసీ పరిధి డిజిటల్ ప్లాట్‌ఫామ్ అపోలో 24x7 ద్వారా మరింత బలపడిందన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ 19,000 పైగా పిన్‌కోడ్‌లకు డెలివరీ చేస్తుందని అపోలో ఫార్మసీ సీఈఓ పి జయకుమార్ తెలిపారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన లక్ష్మీపురం విద్యార్థిని శ్రావ్య

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని కరుకుత్త శ్రావ్య జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైంది. గత నెల 28,29 తేదీలలో ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరులో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో పాల్గొని మంచి ప్రదర్శన కనబరిచిందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చిల్ల

వెంకటరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతులెట్టి సత్యారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో లక్ష్మీపురం శ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మకర్త గాదు తాతినాయుడు పాల్గొని విద్యార్థిని కరుకుత్త శ్రావ్యను అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మొకర శంకర్రావు, వైస్ చైర్మన్ కరుకుత్త రమణ, నాయకులు గాదు తాతి నాయుడు, కనకల వెంకటరమణ, మొకర పైడినాయుడు కరుకుత్త శ్రీను పాల్గొన్నారు.

నేడు రైతన్న మీకోసంలో పాల్గొననున్న గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బోని గ్రామ పంచాయతీలో బుధవారం ఉదయం 10 గంటలకు రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సంధ్య రత్నప్రభ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు హాజరుకానున్న నేపథ్యంలో రైతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఏవో తెలిపారు.

ఘనంగా అయ్యప్ప అన్నదానం ముగింపు

విశాలాంధ్ర - కొమ్మాది: పీఎం పాలెం సమీపంలో ఉన్న పరుశురాం గురుస్వామి అయ్యప్ప పీఠం ప్రధాన శిష్యులు పోతిన యల్లాజి, వాండ్రసి భాస్కర్ అధ్యక్షతన అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల దీక్ష (41 రోజులు) అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యల్లాజి గురు స్వామి మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 22న ఈ అన్నదానం ఘనంగా ప్రారంభమైందని ఈ నెల రెండో తేదీ వరకు నిర్వహించి మంగళవారంతో ముగింపు చేశామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అన్నదానం కార్యక్రమానికి నిత్యం రోజుకు 900 నుండి వెయ్యి మంది వరకు మాలధారులు భక్తులు నిత్య అన్నదానంలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారన్నారు. ప్రతి రోజు అన్నదానానికి 90 వేలు ఖర్చు

అవుతుందని ఈ 41 రోజులకు దాదాపుగా 30 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పరుశురాం గురు స్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోతిన యల్లాజి, వాండ్రసి భాస్కర్ స్వామి, పోతిన మురళి, పోతిన అప్పన్న, విశ్వ కళాశాల సంస్థ చైర్మన్ జనార్దన్, బొడ్డేటి చిరంజీవి స్వామి, కె.చిన్న (మాస్టర్) స్వామి సంతోష్ పాండే తదితరులు పాల్గొన్నారు.